క్లుప్తంగా

పైపులైను విస్తరణ పనులకు శంకుస్థాపన



మోరిపోడులో పైపు లైను విస్తరణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో వాటర్ పైపు లైను విస్తరణ పనులను సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలోని కడలి వారి గ్రూపు, గుబ్బల వారి గ్రూపు, రంపాలమ్మ గుడి ఏరియాకు సంబంధించిన సదరు పైపు లైను విస్తరణ పనులు చేపడుతున్నట్టు ఆమె అన్నారు. ఈ పనుల ద్వారా ఆయా ఏరియాల్లో రానున్న వేసవిలో సమృద్ధిగా తాగునీరు సరఫరా చేసే వీలు కలుగుతుందన్నారు. ఎంపీటీసీ బళ్ల సుభాషి, ఉపసర్పంచ్ కడలి శ్రీను నాయకులు ముప్పర్తి నాని, బళ్ళ లక్ష్మణ్, నిమ్మగడ్డ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



టేకిశెట్టిపాలెంలో చలివేంద్రం ప్రారంభంలో ప్రముఖులు

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెంలో సోమవారం పల్లపోతు జైదీప్, తన తల్లిదండ్రుల, బంధువుల ప్రోత్సాహంతో మానవతా మూర్తులు, సేవా సంస్థ పేరుతో చలివేంద్రం ప్రారంభించారు. ఈ మేరకు చలివేంద్రాన్ని సంస్థ అధ్యక్షుడు బోణం రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రానున్న వేసవి పూర్తయ్యే వరకూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తామని జైదీప్ తెలిపారు. పల్లపోతు సత్యనారాయణమూర్తి, గిడుగు తాతాలు, వాకా రాంబాబు, మెజీషియన్ రాజు, మిరియాల గణపతి, నక్కా శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు



కడియం నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డు

ఆలమూరు: కడియం నుంచి వెదురుమూడి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయి. మూడు నియోజకవర్గాలను కలిపి ఈ రోడ్డులో పదో కిలోమీటరు మైలు రాయి నుంచి సంధిపూడిలోనున్న 23వ కిలోమీటరు మైలు రాయి వరకూ సుమారు 13.88 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును ఆధునీకరించనున్నారు. అలాగే మండపేట నుంచి జొన్నాడ వరకూ 13.73 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.2.75 కోట్లను మంజూరు చేసింది. మంజూరైన నిధులతో త్వరలోనే టెండర్లను పిలిచి పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

విసనకర్రల పంపిణీ



ర్యాలిలో విసనకర్రలు పంపిణీ చేస్తున్న సినీ హాస్యనటులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలోని ర్యాలిలో సోమవారం విసనకర్రల పంపిణీ జరిగింది. స్థానిక అనూస్ హోం వద్ద రావులపాలెం సామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీనటులు గౌతమ్ రాజు, జోగినాయుడు, నెల్లూరు హరిబాబు పాల్గొని విసనకర్రలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తాటి ఆకుల విసనకర్రల వాడకం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు శారీరక ఆరోగ్యాన్ని, విద్యుత్ ఆదా చేసుకోవచ్చన్నారు. అలాగే ఈ విసనకర్రల తయారీ, అమ్మకాలు కూడా కొంతమంది జీవనోపాధి పొందేందుకు దోహదపడుతుందన్నారు. జైపూర్ రాంబాబు, పెద్దింటి రామం, సిద్ధాంతి సత్తిబాబు, లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీత, డాక్టర్ సూర్యచంద్రరావు, శ్యామ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామానికి చెందిన సీనియర్ కమ్యూనిస్ట్ నేత దేవ సూర్యారావు (80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు. సూర్యారావు మొదటి తరం కమ్యూనిస్ట్ నాయకుడు. సూర్యారావు మరణంపై సీపీఐ రాజోలు నియోజక వర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తీరంలో వ్యవసాయం విలవిల

- చనిపోతున్న సరుగుడు, కొబ్బరి మొక్కలు
- కాపాడుకునేందుకు రైతుల ఆపసోపాలు
- అదనపు భారం, ఆర్థిక ఇబ్బందులు



పడమటిపాలెంలో ఎండలకు కొబ్బరి చెట్లను కాపాడుకునేందుకు రైతు అవస్థలు

మలికిపురం: సముద్ర తీరంలో ఎండల ధాటికి వ్యవసాయం విలవిలలాడుతోంది. రైతులు ఎంతో కష్టపడి పెంచుతున్న కొబ్బరి, సరుగుడు తోటలు వేడికి చనిపోతున్నాయి. రాజోలు దీవిలో అంతర్వేది పల్లిపాలెం నుంచి కరవాక వరకూ సుమారు 20 గ్రామాలు సముద్ర తీరంలో విస్తరించి ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 40 వేల ఎకరాల ఇసుక భూములు ఉన్నాయి. వీటిలో వందలాది ఎకరాల్లో కొబ్బరి, సరుగుడు సాగవుతోంది. ఇక్కడ సాగుకు ఇరిగేషన్ వ్యవస్థ లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్లు లేవు. రైతులంతా రెక్కల కష్టం, వర్షాధారంపైనే సరుగుడు, కొబ్బరి సాగు చేస్తూ జీవనం సాగిస్తారు. వేసవి వచ్చిందంటే ఏటా ఈ తోటల రక్షణకు అదనపు భారం తప్పడం లేదు. ప్రస్తుతం వాటిని ఎండల నుంచి కాపాడుకోవడానికి సైతం నానా అవస్థలు పడుతున్నారు. మార్చి నెల ప్రారంభం నుంచీ ఎండలు దంచుతున్నాయి. అసలే వేసవికాలం. ప్రస్తుతం ఇక్కడ 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతతో ఎండ తీవ్రత ఉంది. వర్షం కురిసి ఐదు నెలలు పైగా గడుస్తుంది. పొలాల్లో రైతులు తీసుకున్న ఊటబావులు, బోదెలు ఎండిపోతున్నాయి. చెట్టు మొదలు తడుపుదామన్నా చుక్క నీరు లేదు. ఆదాయం అంతంత మాత్రంగా ఉండే ఈ భూముల్లో పంటలను ఎండల ధాటి నుంచి కాపాడుకోవడానికి రైతాంగం నానాపాట్లు పడుతోంది. రూ.వేలు ఖర్చు చేసి బోర్లు వేసుకుంటున్నారు. ఇంజిన్లు వేసి ప్రతి రోజూ డీజిల్‌తో తోటలకు నీరు తోడుతున్నారు. ఎకరానికి ప్రతి రోజు ఐదు లీటర్ల వెచ్చించాల్సి వస్తుంది. కొబ్బరి తోటలకైతే ఎకరానికి పది లీటర్లు కూడా సరిపోవడం లేదు. అయినా చాలా గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు రావడం లేదు. దీంతో చేసేంది లేక రైతులు మిన్నకుంటున్నారు.

తీర గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు

సముద్ర తీర గ్రామాల్లో అనేక ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం లేదు. సముద్ర తీరం నుంచి రెండు నుంచి మూడు కిలోమీటర్ల పై వరకూ ఆ భూములు ఉన్నాయి. ఇక్కడ విద్యుత్ సౌకర్యం లేక కనీసం మోటార్లు వేసుకునే వీలు లేదు. దీంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది. దీంతో డీజిల్ మోటార్లే దిక్కు. దీంతో అదనపు భారం రైతులపై పడుతోంది. ఈ గ్రామాల్లో నివాసం ఉంటున్న, ఇసుక భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతుల్లో 80 శాతం మంది నిరుపేద రైతులే. ప్రత్యామ్నాయం లేక ఈ భూములపైనే ఆధారపడి వీరంతా జీవం సాగిస్తున్నారు. ప్రభుత్వం వీరి ఇబ్బందులు కనీసం పట్టించుకోవడం లేదు. సుమారు 15 ఏళ్ల క్రితం ఇక్కడి రైతులకు సబ్సిడీపై కిరోసిన్ సరఫరా చేసిన ప్రభుత్వం అనంతరం ఎత్తి వేసింది. కొన్ని గ్రామాల్లో రైతులకు మోటార్లు ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వలేదు. దీంతో అనేక మంది రైతులు పూర్వం నుంచి వాడుకలో ఉన్న ఊట బావులపైనే ఆధార పడి వ్యవసాయం చేస్తున్నారు. అయినా వారి సరుగుడు, కొబ్బరి తోటలను ఎండల ధాటి నుంచి రక్షించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎండలకు మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో సుమారు 10 శాతం సరుగుడు, కొబ్బరి తోటలు చనిపోయే ప్రమాదం ఉందని తీర ప్రాంత రైతాంగం పేర్కొంది. ఇప్పటికే అనేక ఎకరాల్లో ఉప్పునీటి ధాటికి అనేక కొబ్బరి చెట్లు చని పోయాయి. అంతర్వేది కర, కేశవదాసుపాలెం, చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఈ నష్టం అధికంగా ఉంది. తీర గ్రామాల్లోని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అందరినీ నూకాలమ్మ చల్లగా చూడాలి



నూకాలమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: అందరినీ నూకాలమ్మ తల్లి చల్లగా చూడాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి అభిలషించారు. మామిడికుదురు గ్రామ దేవత నూకాలమ్మ జాతర సందర్భంగా సోమవారం సూర్యారావు, రాజేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ వారికి సాదరంగా స్వాగతం పలికింది. గ్రామ దేవతలను ప్రజలు తమ ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని చెప్పారు. వారు ప్రజల్ని ఎల్లవేళలా చల్లగా చూస్తారన్నారు. అనంతరం మామిడికుదురులో రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పేద, ధనిక భేదాలు లేకుండా అంతా ఒక్కటే అని రంజాన్ చాటుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి పేర్కొన్నారు. వారి వెంట పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్యకుమార్, కంచి శ్రీరామ్, నెల్లి దుర్గాప్రసాద్, పాలమూరి గోపాల్, అన్వర్ తాహిర్ హుస్సేన్, తులా గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సినీ గాయని



గాయని శ్రీలలితను సత్కరించిన ఆలయ ప్రతినిధులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారిని సినీ నేపథ్య గాయని శ్రీలలిత దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆమె కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ సినీ గాయనిగా ప్రస్థానం ప్రారంభించక ముందు ఈ ఆలయంలో కచేరీ నిర్వహించానని ఆమె గుర్తు చేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తాను సినీ గాయనిగా రాణిస్తున్నానంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ కమిటీ ప్రతినిధి గన్ని వెంకట్రావు తదితరులు శ్రీలలిత దంపతులను ఆలయ మర్యాదలతో గౌరవించి సత్కరించారు. గుడిపాటి శ్రీరామచంద్ర దత్తు, చింతలూరు ఫణీంద్ర కుమార్, ద్విభాష్యం దివాకర్ పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి



సఖినేటిపల్లి శాంతి ర్యాలీలో పాల్గొన్న గొల్లపల్లి

అంబాజీపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ క్రైస్తవులు సోమవారం అంబాజీపేటలో నిరసన ప్రదర్శన జరిపారు. సెయింట్ జోన్స్ లూథరన్ చర్చ్ వద్ద పాస్టర్ మృతికి నిరసన తెలిపారు. పాస్టర్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ కడలి రవి ప్రకాష్, ఎంపీటీసీ ప్రశాంత్, అచ్యుతానందరావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సఖినేటిపల్లి సెంటర్ నుంచి మొదలైన ఈ శాంతి ర్యాలీ మండలంలోని ప్రధాన రహదారి వెంబడి సాగింది. ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యా రావు మాట్లాడుతూ, క్రీస్తు పరిచర్యనే కాకుండా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న ప్రవీణ్ మరణం అనుమానాస్పదంగా ఉందన్న దానిపై ప్రభుత్వం విచారణ చేసి దోషులను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ వైద్యులను సమాజం ఎన్నటికీ మరువదు



ఉద్యోగ విరమణ చేసిన సూర్యనారాయణను సత్కరిస్తున్న సహోద్యోగులు

పి.గన్నవరం: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వైద్యులను సమాజం ఎన్నటికీ మరువదని అమలాపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కె.శంకరరావు అన్నారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో పనిచేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ అప్పారి సూర్యనారాయణ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సూర్యనారాయణ విశేష సేవలు అందించారని పలువురు ప్రశంసించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆస్పత్రి వైద్య సిబ్బందితో పాటు, ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తున్న అబ్దుల్ కలాం ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. సూర్యనారాయణ, చంద్ర శేషామణి దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈఈ జి.రాజేంద్రప్రసాద్, వైద్యులు పి.కోటేశ్వరరావు, ఎల్.శిరీష, ట్రస్టు సభ్యుడు గూటం శ్రీనివాసరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గుడాల సంపదరావు, పితాని మహాలక్ష్మి, కోట రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ డి.పల్లవి, హెచ్ఎస్ లక్ష్మీ అనంతకుమారి, సీహెచ్ మణితేజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా పితాని



మామిడికుదురు: ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన పితాని చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న జరిగాయన్నారు. ఆ ఎన్నికల్లో తాను జాయింట్ సెక్రటరీగా విజయం సాధించానని చెప్పారు. చంద్రశేఖరరెడ్డిని రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

రేపటి నుంచి ఉచిత కోచింగ్

మామిడికుదురు: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 2వ తేదీ బుధవారం నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందని బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, కొత్తపేట, ఆలమూరు, కాట్రేనికోన, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్, కెరియర్ గైడెన్స్‌పై అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్ పర్యవేక్షణలో ఈ శిక్షణ జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా కోనసీమ జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని ఉద్యోగులు, బీసీ ఉద్యోగులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

నేటి నుంచి మార్కెట్ వేళల మార్పు

ఆలమూరు: మండలంలోని మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో మార్పు చేసిన సమయ వేళలు మంగళవారం నుంచి అమలు చేస్తున్నట్లు ఆ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వ్యాపారులు, రైతులు వచ్చి కూరగాయలు కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటారన్నారు. ఇటీవల అనేక మంది రైతులు, మార్కెట్ కమీషన్‌దారులు సమయ వేళలు పాటించకుండా ఇష్టానుసారం లావాదేవీలు జరపడంతో అనునిత్యం గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో మార్కెట్‌లో ప్రతి రోజు ఉదయం ఐదు గంటల నుంచి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మాత్రమే విక్రయాలు, సేకరణ ప్రారంభించాలని మార్కెట్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమయాలను అతిక్రమిస్తే రూ.రెండు వేలు జరిమానా విధించనున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారస్తులు ఈ మారిన వేళలను గుర్తించాలని అధ్యక్షుడు సత్తిబాబు తెలిపారు.

ఉప్పునీటి చెరువుల తవ్వకాలు నిలిపివేయండి

కాట్రేనికోన: పల్లంకుర్రు శివారు లైనుపేటలో పంట భూమిలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా తవ్వుతున్న ఉప్పు నీటి చెరువులను తక్షణమే నిలిపివేయాలని సరిహద్దు రైతులు గ్రీవెన్సు సెల్‌లో ఫిర్యాదు చేసారు. పల్లకుర్రు పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 995, 995/1, 995/2, 995/3 సంగాని రామకృష్ణ భవన్నారాయణ, సంగాని చిరంజీవి సత్తిరాజు, సంగాని వాసుదేవేంద్రరావుకు 4.5 ఎకరాల పంట భూమి ఉందన్నారు. సరిహద్దు రైతు రామకృష్ణంరాజు అనధికారికంగా తవ్వేస్తున్న ఉప్పు నీటి రొయ్యల చెరువులతో సమీపంలోని పంట చేలు దెబ్బతింటాయని, ప్రభుత్వం స్పందించి తక్షణమే చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని గ్రీవెన్సులో ఫిర్యాదు చేసారు. దీనిపై వీఆర్వో సత్యనారాయణ, తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్సులో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో రామకృష్ణంరాజు చెరువుల తవ్వకాన్ని ఆపలేదన్నారు. మరలా రెండవసారి ఆన్‌లైన్‌లో గ్రీవెన్సుకు ఫిర్యాదు చేసామని రామకృష్ణ తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



మలికిపురంలో ఈద్ ముబారక్ తెలుపుకొంటున్న ముస్లింలు



కొత్తపేటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అంబాజీపేట: రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మానవుల మధ్య ప్రేమ, ధనిక తేడా ఉండరాదని, పవిత్ర రంజాన్ ఐక్యతను చాటి చెబుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఖబర్‌స్తాన్‌కు వెళ్లి దివంగతులైన తమ పెద్దల ఆత్మశాంతికి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, ఆరిఫ్, పాషా, కరీముల్లా, కరీమ్, ఎండీ ఇస్మాయిల్, ఎస్కే వలి, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: రంజాన్ వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మలికిపురంలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు పాల్గొన్నారు. విశ్వేశ్వరాయపురంలో కూడా రంజాన్ వేడుకలు జరిగాయి.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలోని వివిధ ప్రాంతాల్లో రంజాన్‌ను ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. ఆదివారం రాత్రి ఆకాశంలో నెల వంకను చూసిన ముస్లింలు రంజాన్ మాస ఉపవాస దీక్షలను ముగించారు. మసీదుల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం పేదలకు దానధర్మాలు చేశారు. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం, మార్కెట్ వీధి, పలివెల, వానపల్లి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో సోమవారం రంజాన్ పురస్కరించుకుని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ మేరకు ముస్లిం ప్రార్థనా మందిరం వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే, వారితో మమేకమై రంజాన్ పండగను జరుపుకొన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నీటి సంఘ ప్రతినిధి వీరా కర్ణుడు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

రైళ్లకు ప్యాసింజర్ బోగీలను పెంచాలి

అమలాపురం టౌన్: రైల్వే శాఖ నడుపుతున్న రైళ్లకు ప్యాసింజర్ బోగీలను పెంచాలని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. రైళ్లకు కేవలం మూడు బోగీలను మాత్రమే ఆ శాఖ సమకూర్చుతోందని, దీని వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లే సాధారణ ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. రైల్వే శాఖ స్పందించి రాష్ట్రం మీదుగా ప్రయాణించే రైళ్లకు ప్యాసింజర్ బోగీలు పెంచాలని స్పష్టం చేశారు. కోటిపల్లి–నర్సాపురం మధ్య కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, సాధనాల రామకృష్ణ పాల్గొన్నారు.

బుధ, గురువారాల్లో విద్యుత్ అంతరాయం

అయినవిల్లి: ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన ప్రధానమైన 220 కేవీ లైన్ సామర్లకోట సబ్ స్టేషన్‌లో విద్యుత్ పరికరాలు (కంట్రోల్ ప్యానెల్స్) మార్పు చేయుటలో భాగంగా ఈ నెల 2వ తేదీ (బుధవారం), 3వ తేదీ (గురువారం) విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ సిద్దెల రాజబాబు సోమవారం నాడొక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ గ్రిడ్ సబ్‌స్టేషన్ పరిధిలో అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు పరిధిలోని ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని రాజబాబు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

రక్త పింజరి కాటు ప్రమాదకరం



తోట్లపాలెంలో పాము కాటుకు మృతి చెందిన ఆవు

అమలాపురం రూరల్: కోనసీమ ప్రాంతంలో రక్త పింజరి పాముల సంచారం పెరిగిందని, ఈ పాము కాటు ప్రమాదకరమని, ప్రజలు, పొలాల్లో ఉండే రైతులు అప్రమత్తంగా ఉండాలని స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ సూచించారు. అమలాపురం మండలం తోట్లపాలెంలో ఆయన సోమవారం మాట్లాడుతూ తోట్లపాలెం రైతుకు చెందిన ఆరు నెలల గర్భంతో ఉన్న ఆవు రక్త పింజరి కాటుతో మృతి చెందిందన్నారు. గత వారం పాము కాటుతో జిల్లాలో ముమ్మిడివరం, మామిడికుదురు మండలాల్లో ఇద్దరు మృతి చెందారని తెలిపారు. వేసవి నేపథ్యంలో పాముల సంచారం అధికంగా ఉంటుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాము కనిపిస్తే చంపకుండా తనకు సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా లక్ష చామంతి పూజ

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీకామాక్షీ పీఠం మహా సంస్థానంలో మూడు రోజుల కిందట మొదలైన ఉగాది మహోత్సవాలు పీఠంలోని శ్రీకామాక్షీ అమ్మకు సోమవారం నిర్వహించిన లక్ష చామంతి పూజతో ముగిశాయి. వందలాది మంది మహిళలు సమక్షంలో పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో పీఠం ఉత్తరాధికారి, బాల బ్రహ్మచారి విఘ్నసన రాఖీ ప్రేమ్, పీఠం బ్రహ్మ గోవిందవర్జుల నాగబాబు ఆధ్వర్యంలో లక్ష చామంతి పూజ నిర్వహించారు. మహిళలు సామూహిక లలితా సహస్ర పారాయణ చేశారు. లక్ష చామంతి పూజ తర్వాత ఉగాది సందర్భంగా నిర్వహించిన దీక్షాధారణను పీఠం పండితులు విరమించారు. పీఠం ప్రేమమందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మత్రి దుర్గారావు పాల్గొన్నారు.

వైభవంగా మాణిక్యాంబ తీర్థం

ఐ.పోలవరం: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి మాణిక్యాంబ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, కోలాటాలు, మన్యం నృత్యాలు, తీన్‌మార్, విచిత్ర వేషధారణలు భక్తులను ఆకట్టుకొన్నాయి. వేకుజజామున 2 గంటలకు జాతీయ రహదారి 216పై ఏర్పాటు చేసిన నిప్పుల గుండం చూసేందుకు భక్తులు తరలివచ్చారు. రెండు రోజుల్లో సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి మరుసటి రోజు నుంచి నెల రోజుల పాటు అమ్మవారి ఆలయంలో రాత్రి పూట జాతర నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

శివపంచాయతన యాగం ప్రారంభం

అల్లవరం: దేవగుప్తంలో ఉమా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మరువాడ వెంకటేశ్వర శర్మ, పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో నక్షత్ర పూర్వక నవగ్రహ సహిత శివ పంచాయతన యాగాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ యాగంలో తొలి రోజున గణపతి పూజ, మండపారాధన, కలశస్థాపన, మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, కుంకుమ పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం అష్టోత్తర కలశాభిషేకం, పత్రి పూజ, 27 నక్షత్రాలకు నవగ్రహ పూజ నిర్వహించనున్నట్టు శ్యామ్ శర్మ తెలిపారు.

'నడక సింహాసనం' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన నడక కవి నల్లా నరసింహమూర్తి రచించిన 100వ నడక నానీల కవితా సంపుటి 'నడక సింహాసనం' ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని ఎంపీ గంటి హరీష్ మాథుర్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సూత్రాలను చిన్న కవితల రూపంలో చైతన్య పరుస్తున్న నడక కవి నరసింహమూర్తి సాహితీ సేవలు అభినందనీయమని ఎంపీ హరీష్ పేర్కొన్నారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.